క్లుప్తంగా

పాదయాత్రగా శివస్వాములు



బొంరాస్‌పేట: మహాశివరాత్రి రోజు స్వామివారి దర్శనం కోసం మండల పరిధిలోని వడిచర్లకు చెందిన శివస్వాములు శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరారు. ఆదివారం ఉమామహేశ్వరం చేరుకొని పూజలు నిర్వహించారు. పాదయాత్రగా వెళ్తున్న వారిలో గురుస్వామి బావప్ప, శివస్వాములు హరి, శ్రీను, వెంకటేశ్, పి.అంజి, జి.అంజి, అరవింద్, శ్రీశైలం, విష్ణు, శ్రీను ఉన్నారు.

వైభవంగా జ్యోతిర్లింగ మహా పడిపూజ



జ్యోతిర్లింగ మహాపడిపూజలో పాల్గొన్న స్వాములు

కుల్కచర్ల: మండలం పరిధిలోని చెరువుముందలి తండాలో శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా నిర్వహించారు. గణపతిపూజ, నవగ్రహ పూజ, శివుడికి రుద్రాభిషేకం కార్యక్రమాలను చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివానంద గురుస్వామి, కుమార్‌స్వామి, శంకర్ గురుస్వామి, వినోద్ గురుస్వామి, సత్యం గురుస్వామి, నరసింహారెడ్డి, మణికంఠ భజన మండలి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి శిశుమందిర్ వార్షికోత్సవం



వేడుకల్లో విద్యార్థులు

పరిగి: పట్టణ కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వక్త అఖిల భారతీయ జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం నేర్పించాలన్నారు. ప్రతి ఒక్కరిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసులు పెట్టాలి

వికారాబాద్ అర్బన్: దళితులపై దాడులకు పాల్పడిన వ్యక్తులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి. కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో నాపై కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించి, వేదికపై నుంచి బలవంతంగా దింపి అవమానించినట్లు చెప్పారు. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే సదరు వ్యక్తులపై ఇప్పటికీ కేసులు నమోదు చేయడం లేదని ఆరోపించారు. వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి జిల్లా ఎస్పీకి నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. పోలీసుల తీరు అగ్రవర్ణాలకు మద్దతు ఇస్తూ, ఎస్సీ, ఎస్టీలను అన్యాయం చేస్తున్నట్లుగా ఉందన్నారు. పోలీసులు స్పందించకుంటే మార్చి 5న డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌గౌడ్ రాజీనామా



తాండూరు రూరల్: మండలంలోని చెన్గేస్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి వై.ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌కు లేఖ రాశారు. పార్టీలో తగిన ప్రాధాన్యం లేకపోవడంతో పాటు మండల స్థాయి నాయకులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదన్నారు. రాజీనామాను అమోదించాలని కోరారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ప్రవీణ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహేశ్

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్ పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడ గ్రామానికి చెందిన తుర్పటి జంగయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహేశ్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలోఉన్న నిరుపేద కుటుంబాలకు ఆదుకుంటామని తెలిపారు.



మోమిన్‌పేట: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ సుజల



తాండూరు రూరల్: చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ నేత పురుషోత్తం



బార్వాద్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ నర్సింహారెడ్డి

నిండు జీవితానికి రెండు చుక్కలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఉ.7 గంటల నుంచి సా.5 గంటల వరకు కొనసాగింది. చిన్నారుల తల్లిదండ్రులు విధిగా ఆయా ప్రాంతాల్లోని సెంటర్లలో పోలియో చుక్కలు వేయించారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి వేయనున్నారు. వైద్య సిబ్బంది పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.



యాలాల: చిన్నారికి చుక్కలు వేస్తున్న డాక్టర్ అనూష



దారూరు: బస్టాండు ఆవరణలో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం



దోమ : పోలియో చుక్కలు వేస్తున్న అంగన్వాడీ టీచర్ సావిత్రి



కొడంగల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ రవీంద్రయాదవ్



బొంరాస్‌పేట: పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది



బంట్వారంలో పోలియో చుక్కల నమోదుపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్



రామయ్యగూడలో పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ

ముమ్మరంగా సీసీరోడ్డు పనులు



బొంరాస్‌పేట: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం గ్రామంలోని కింది హనుమాన్ ఆలయం నుంచి సీసీ రోడ్డు నిర్మాణం పనులు జరిగాయి. రోడ్డు పనులు చేపట్టడంతో ఆయా కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీటీరోడ్డు వేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: చాకల్‌పల్లి, కల్మన్‌కాల్వ, కొత్తపల్లి గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యాన్ని మెరుగుపర్చాలని ఆయా గ్రామాల నాయకులు ఆదివారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకల్‌పల్లి గ్రామం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఫతేపురం గ్రామానికి దగ్గరగా ఉన్న రహదారిని బీటీరోడ్డుగా మార్చి ప్రజలకు ఉపయోగకరంగా మార్చాలని కోరారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇచ్చిన సిఫారసు పత్రాన్ని ఆయనకు అందజేశారు.

నహీద్‌కు గోల్డ్‌మెడల్

కొందుర్గు: సికింద్రాబాద్ ప్యారడైజ్ క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్స్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొందుర్గు న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థిని ఎండీ నహీద్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నట్లు కరాటే మాస్టర్ రమేశ్ పేర్కొన్నారు. అండర్ 14 బాలికల విభాగంలో స్పైరింగ్‌లో ప్రతిభచూపి గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



బండవెల్కిచర్లలో బ్యాగులు అందజేస్తున్నబీజేపీ నేతలు

కుల్కచర్ల: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తమవంతు కృషి చేస్తున్నామని మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి సోదరి మీరా కుమారి అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని బండవెల్కిచర్లలో జరుగుతున్న సంతలో ప్లాస్టిక్ రహిత బ్యాగులను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయంలో సైతం అవినీతి రహిత పాలనకు మద్దతు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల బీజేపీ అధ్యక్షుడు మైపాల్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, నరసింహారెడ్డి, ముదిరాజ్ సంఘ నాయకులు శ్రీశైలం ముదిరాజ్, అంజనేయులు ముదిరాజ్, కేవీఆర్ పౌండేషన్ కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, బైరం నరేష్, మాల అనంతయ్య, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి



కూలర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్ : దుకాణ యజమానులు విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి అగ్నికి ఆహుతైన ఫర్‌ఫెక్ట్ కూలర్ దుకాణాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో దుకాణమంతా కాలిపోవడం దురదృష్టకరమన్నారు. దుకాణ యజమానికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం కోసం పోరాడాలి



పూడూరు: విగ్రహావిష్కరణలోఎమ్మెల్యే రాజాసింగ్, విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు



దోమ : కత్తితో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

పూడూరు: ప్రతి ఒక్కరు హిందూ ధర్మం కోసం పోరాడాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఆదివారం మండలంలోని కంకల్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని అనుసరించాలన్నారు. అయోధ్య రామమందిరం తరహాలోనే మధుర, కాశీలో దేవాలయాలను పునర్‌నిర్మాణం చేయడం మా లక్ష్యమన్నారు. హిందూ మత వ్యతిరేకులు ఎంత మంది కుట్రలు, కుతంత్రాలు పన్నినా చివరకు హిందూ ధర్మం గెలుస్తుందన్నారు. దీనికి నిదర్శనం రామమందిర నిర్మాణమే అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మేఘమాల, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ బూనేటి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, బీజేపీ నాయకులు మల్లేష్‌పటేల్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలకు ఛత్రపతి శివాజీ ఆదర్శం

దోమ : మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ దేశ ప్రజలకు ఆదర్శమని గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని మోత్కుర్ గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ బాల్యం నుంచి ఎంతో క్రమశిక్షణగా ఎదిగారని, తల్లి జిజియాబాయి చిన్నతనం నుంచే రామాయణ, మహాభారత గాథలను చెప్పి వీర లక్షణాలను మొలకింపజేసిందన్నారు. తన తల్లి స్ఫూర్తితోనే హిందువుల ఐక్యత, విస్తరణ కోసం భీకరమైన యుద్ధాలు చేసి ముస్లింల రాజుల నుంచి హిందువులను కాపాడిన ఘనత శివాజీకే దక్కుతుందన్నారు. నేటి యువత ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, కరణం ప్రహ్లాదరావు, బూనేటి మారుతికిరణ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కాసాని వీరేశ్ ముదిరాజ్, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులపై దాణా గుదిబండ

- రోజురోజుకూ పెరుగుతున్న ధరలు
- ఆందోళనలో రైతులు



దుకాణంలో వివిధ రకాల దాణాలు

పరిగి: పాడి ఉన్న ఇంట సిరులు పండున్నంటా అనే సామెత ఇప్పుడు పాడి ఉన్న రైతుల ఇంట కష్టాలు తెచ్చిపెడుతుంది. పాడి రంగాన్ని ఎంచుకున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. పాడి రంగంలో రాణించాలంటే అధిక పాలు ఇచ్చే పశువులకు మంచి పోషణ అందిస్తేనే పాడి రంగంలో రాణించగలుగుతారు. రైతులు మేతతో పాటు రెండు పూటల దాణాను పశువులకు వేయాలి. దీంతో అధిక పాలు ఇవ్వడంతో పాటు పశువులు ఆరోగ్యంగా ఎక్కువ రోజులు పాలు ఇచ్చేందుకు వీలుంటుంది. కాని పాడి రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో దాణాను పెట్టే ఆలోచనలో లేరు పాడి రంగం నష్టాన్ని తెచ్చిపెట్టుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణం పాల ధరలు తగ్గిస్తూ.. దాణా ధరలు పెంచడమే ముఖ్య కారణమని పాడి రైతులు చెబుతున్నారు. జిల్లాలో 19 మండలాలు ఉండగా జిల్లా వ్యాప్తంగా సుమారుగా ఆవులు 2లక్షలు, గేదెలు 1లక్ష 70వేలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు 55వేల లీటర్ల నుంచి 65 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుంది.

నష్టాల దారిలో..

పెరుగుతున్న దాణ ధరలతో రైతులకు మిగులుబాటు లేక నష్టాల ఊబిలో పడుతున్నారు. గత నెల రోజుల నుంచి దాణా రేట్లు పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డైయిరీలో ఎక్కువగా రైతులు పత్తి దాణాను వాడుతుంటారు. నెల రోజుల క్రితం పత్తి దాణా కిలో రూ. 30 ఉండగా ప్రస్తుతం రూ.35 పెరిగింది. మరో నెల రోజుల్లో రూ. 40 దాటే అవకాశం ఉందని దాణా దుకాణాల నిర్వాహకులు, మిల్లుల యజమానులు పేర్కొంటున్నారు. అలానే మొక్కజొన్న రూ.25 ఉండగా, ప్రస్తుతం రూ. 28కి చేరింది. పల్లి రూ.35 నుంచి 45కి చేరింది. కొబ్బర రూ.35 నుంచి రూ. 40కి పెరగడంతో రైతులు పశువులకు దాణాలు అందించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో పాల ఉత్పత్తి తగ్గడంతో పశువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో రైతులు పాడి రంగాన్ని వీడి వేరే వైపు అడుగులు వేస్తున్నారు. ఇటీవల పరిగి, దోమ, కుల్కచర్ల, పూడూర్ మండలాల్లోని డైయిరీల్లో లక్షల్లో నష్టాలు రావడంతో పశువులను అమ్మి వేరే రంగాన్ని ఎంచుకున్నారు.

కబేళాలకు తరలిస్తున్న రైతులు

రైతులు పాడి పశువులతో లాభాలు లేక కబేళాలకు తరలిస్తున్నారు. రైతులకు పశువులను పోషించటం భారంగా మారడంతో తక్కువ ధరలకు కబేళాలకు విక్రయించి అడ్డా కూలీలుగా మారుతున్నారు. ప్రైవేటు డైయిరీలు ఒక మోస్తారు పాల ధరలు పెంచుతున్నప్పటికీ దాణాల ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రంగాలను ఆదుకుంటున్న ప్రభుత్వం పాడి రైతులను కూడా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధరలను నియంత్రించాలి



ప్రభుత్వం ధరలను నియంత్రించేందుకు కృషి చేయాలి. రోజు రోజుకు దాణా ధరలు పెరుగుతుండటంతో పశువులకు అందించేందుకు వెనకడుగు వేయాల్సి వస్తుంది. దీంతో పాల దిగుబడి దెబ్బ తింటుంది. దాణా మిల్లుల కొరతను దృష్టిలోఉంచుకుని ఇష్టానుసారంగా ధరలను పెంచుతున్నారు. దీంతో పాడి రైతులపై భారం పడుతుంది.

– రవి, పాడి రైతు, మోత్కూర్

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలి. పక్క రాష్ట్రాల్లో పాడి రైతులపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఆయా రాష్ట్రాల్లో ఎక్కువైన పాలను మన రాష్ట్రం కొనుగోలు చేస్తుంది. పక్క రాష్ట్రాల్లో పాడి రైతులకు సబ్సిడీపై దాణాలను, చెరుకు గడలను, పశుగ్రాసాన్ని అందిస్తున్నాయి.

– రమేశ్, పాడి రైతు, దోమ

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం



చిన్నారుల నృత్య ప్రదర్శన

అనంతగిరి: పిల్లలకు చదువులతో పాటు ఆటలు విషయాలపై అవగాహన కలిగిస్తూ చదువు అందిస్తే నైపుణ్యమైన విద్యను నేర్చుకుంటారని ప్రొఫెసర్ ఎంఎల్ సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని బచ్‌పన్ స్కూల్‌లో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. పిల్లలకు ఒక గంట చదివిస్తే ఒక గంట ఆటల కోసం సమయం ఇవ్వాలన్నారు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఒత్తిడి లేని విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ అందించడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపల్ శ్వేతాపాటిల్, వైస్ ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు స్వప్న, మౌనిక, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్ : పీఆర్టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, కాంగ్రెస్ నాయకులు మురళీకృష్ణ గౌడ్, వేణు, రవిరాజ్, వెంకన్న గౌడ్, పీఆర్టీయూ జిల్లా నాయకులు విజయ్, శ్రావణ్ కుమార్, బి మల్లేశం పాల్గొన్నారు.

బారులు తీరిన భక్తులు



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అమ్మవారి మూలమూర్తి

కొడంగల్ : పోలేపల్లి రేణుకాఎల్లమ్మ ఆలయంలో భక్తులు బారులుతీరారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర ప్రారంభమైన తొలి ఆదివారం కావడంతో తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.